క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు: పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామివారి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

వికసిత్ కృషి సంకల్ప్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి

కోవూరు: కేంద్ర ప్రభుత్వం ఈనెల 29 నుంచి జూన్ 12 వరకు జిల్లా వ్యాప్తంగా వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, దీనిని విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏఓ) పి.సత్యవాణి తెలిపారు. మండల కేంద్రమైన కోవూరులో ఆమె గురువారం మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు గ్రూపులుగా ఏర్పడి రైతులకు ఖరీఫ్ పంటలకు సంబంధించి అవసరమైన సూచనలు ఇవ్వాలని, నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించాలన్నారు. దీనితో పాటు రైతులతో నేరుగా ముఖాముఖి కార్యక్రమాలు చేపడుతారన్నారు. అన్నదాత సుఖీభవకు రైతుల జాబితా పరిశీలన జరుగుతుందన్నారు. అనంతరం కేంద్రీయ వరి పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ వ్యవసాయంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కాగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో 17 శాతం తేమతో ఆరబెట్టడం కష్టంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ శివన్నారాయణ, శాస్త్రవేత్త డాక్టర్ వినీత, ఏడీ సుజాత, మధురిమ, కోవూరు ఏఓ ఇందిరావతి, సహాయకులు మౌనిక, మెహరున్నీసా, చైతన్య, నారాయణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



విడవలూరు: మండల కేంద్రంలోని దత్తసాయి మందిరంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. పెళ్లకూరు కోటయ్య నాయుడు, రామసుబ్బమ్మల జ్ఞాపకార్థం కుమారుడు రామయ్య నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం జరిగింది. అర్చకుడు మధు, సేవకుడు వెంకయ్య పాల్గొన్నారు.

సుపరిపాలనకు స్వస్తి

ఇంటింటి సేవలకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం

- సక్రమంగా అమలు కాని ఫ్యామిలీ డాక్టర్
- ఇంటికి చేరని వృద్ధాప్య పింఛన్లు
- ఎండీయూ వాహనాల తొలగింపు
- కక్షగట్టి వలంటీర్ల వ్యవస్థ ఎత్తివేత
- వృద్ధులు, దివ్యాంగులకు తప్పని తిప్పలు


పొదలకూరు మండలంలో ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటికి వెళ్లి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి(ఫైల్)

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

వైఎస్సార్‌సీపీ మార్క్ సుపరిపాలనకు కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే స్వస్తి పలికింది. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు, పింఛన్, రేషన్, వైద్యం వంటివి అందేలా చేశారు. వీటికి ప్రజల్లో కూడా విశేషాదరణ ఉంది. దీంతో ఆయా వ్యవస్థలపై కూటమి నాయకత్వం కక్షగట్టి తొలగించి ప్రజలను ఇబ్బందుల పాలుజేసింది.

పొదలకూరు : గత ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా మంచాన పడి ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు వైద్యం అందించేవారు. ప్రతి వారం డాక్టర్ గుర్తుపెట్టుకుని శస్త్రచికిత్సలు చేయించుకున్న వారే కాక దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టిన వారిని ఆప్యాయంగా పలుకరించి పరీక్షలు నిర్వహించేవారు. అంతేకాక ఉచితంగా మందులు అందజేసి అవసరమైతే మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు పంపేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించడం లేదని, కూటమి ప్రభుత్వంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పేరుతో 104 వాహనాలు గ్రామాలకు వెళ్తున్నా ఇంటి వరకు వైద్యం వెళ్లడం లేదు. వలంటీర్ల వ్యవస్థ ఉండి ఉంటే దీర్ఘకాలిక రోగులను గుర్తించి వైద్యుల దృష్టికి తీసుకుని వెళితే ఇళ్లకు వెళ్లి పరీక్షలు నిర్వహించేవారని, వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడడం వల్లనే గడపగడపకు సేవలు అందడం లేదంటున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా 2023 జూలై 1 నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో నెలరోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 11 రకాల సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశారు. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదని, సచివాలయాలకు వెళ్లినా సర్టిఫికెట్లు పంపిణీ చేయడంలో జాప్యం జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎండీయూ వాహనాలు జూన్ 1 నుంచి పూర్తిగా తొలగించారు. ఇంటింటికి రేషన్ సరుకులను అందజేసే ప్రక్రియకు కూటమి ప్రభుత్వం స్వస్తిపలికిందని, రేషన్‌షాపులకు వెళ్లి బియ్యాన్ని మోసుకు రావాల్సి ఉంటుందని ప్రజల్లో ఆందోళన మొదలైంది.

గడపల వద్దకు చేరని పింఛన్లు

గతంలో వలంటీర్లు తెల్లవారకముందే వృద్ధులు, దివ్యాంగులకు ఠంచనుగా పింఛను అందజేసేవారు. ఆరోగ్యం బాగలేక బయటి ప్రాంతాల్లో ఉన్నా అక్కడికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఇప్పుడు సచివాలయ సిబ్బంది కూడళ్లలో కూర్చుని వృద్ధులను అక్కడికి పిలిపించి పింఛన్లను అందజేస్తున్నారు. మంచంలో ఉన్న వారికి మాత్రం ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు 38 వేల పైచిలుకు పింఛన్లను ప్రతినెల అందజేయాల్సి ఉంటుంది. అయితే వలంటీర్ల వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రధానంగా వృద్ధులకు ఇబ్బందిగా మారింది. సచివాలయ సిబ్బంది తమ రోజువారీ పనులతో పాటు పింఛన్లను అందజేయడం కష్టంగా ఉందంటున్నారు.

మండలానికి రెండు పీహెచ్‌సీలు

గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలకు వైద్యసేవలను మరింతగా విస్తరించేందుకు మండలానికి రెండు పీహెచ్‌సీలు ఉండాలనే లక్ష్యంతో అదనంగా కో–లొకేటెడ్ పీహెచ్‌సీని ఏర్పాటు చేసింది. ఇక్కడ కూడా ఇద్దరు డాక్టర్లతో పాటు, నర్సులు, సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం కో–లొకేటెడ్ పీహెచ్‌సీ డాక్టర్లు ఫ్యామిలీ కాన్సెప్ట్, సాధారణ పరీక్షల్లో పాల్గొంటున్నారు. గత ప్రభుత్వ దూరాలోచనతో ఏర్పాటు చేసిన కో–లొకేటెడ్ పీహెచ్‌సీల వద్ద మండలానికి నలుగురు డాక్టర్లు ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీకు రూ.3 లక్షల విలువైన ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలను అందజేసింది.


నెల్లూరు జీజీహెచ్‌లో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)

ఏడాదిగా తిప్పకుంటున్నారు



కోవూరు : ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు కిష్టమ్మ. కోవూరు మండలం పడుగుపాడు ఎన్టీఆర్ నగర్ గిరిజన కాలనీలో నివాసముంటుంది. ఈమె భర్త శీనయ్య చనిపోయి ఏడాదిన్నర కావస్తోంది. కూటమి ప్రభుత్వంలో ఆమె పింఛన్ కోసం సచివాలయం చుట్టూ తిరగని రోజు లేదు. వలంటీర్ వ్యవస్థ ఉండుంటే వారి ద్వారా ఆమెకు పింఛన్ మంజూరు కాలేదు. కానీ సచివాలయ వ్యవస్థ నిర్వీర్యంతో ఆమె ఎప్పుడు వెళ్లినా తిప్పుకుంటున్నారే తప్ప పింఛన్ మాత్రం మంజూరు కాలేదు. ప్రభుత్వం మాలాంటి వారిపై జాలి చూపి ఇప్పటికైనా పింఛన్ మంజూరు చేయాలని కిష్టమ్మ వేడుకుంటోంది.

వలంటీర్లు మోసపోయారు



చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థను కొనసాగించడంతో పాటు ప్రతి నెలా రూ.10 వేలు జీతం పెంచి అందజేస్తానని ఎన్నికల హామీ ఇవ్వడంతో ఓట్లు వేశాం. ఇప్పుడు ఉన్న ఉద్యోగాన్ని కూడా తొలగించారు. వలంటీర్ల వ్యవస్థలో తెల్లవారక ముందే వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికి వెళ్లి తలుపు తట్టి పింఛన్లను అందజేసేవారం.

– మల్లికార్జున, దళితవాడ, మాజీ వలంటీర్, మనుబోలు

ఉన్న ఉద్యోగం ఊడింది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లను బాగా చూసుకున్నారు. భవిష్యత్తు ఉంటుందని హామీ ఇచ్చారు. అయితే చంద్రబాబు ఇచ్చిన హామీలను నమ్మిన వలంటీర్లు ఉన్న ఉద్యోగాన్ని ఊడగొట్టించుకున్నారు. దీంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ముఖ్యంగా వృద్ధుల పింఛన్ల పంపిణీ పరిస్థితి ఘోరంగా ఉంది.

– గుమ్మా మహేంద్ర, మాజీ వలంటీర్, తాటిపర్తిపాళెం, వెంకటాచలం మండలం

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్ బైక్ అదుపుతప్పి పడి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో గురువారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన పవన్‌కుమార్ పనినిమిత్తం నెల్లూరుకు వెళ్లారు. తిరిగి గూడూరుకు వెళ్తుండగా, కాకుటూరు సమీపానికి చేరుకోగానే ఎదురుగా కారు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది.
ఈ ప్రమాదంలో పవన్‌కుమార్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు

పొదలకూరు: పట్టణంలోని పద్మావతి నగర్‌లో విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఏడీఈ సుబ్రమణ్యం అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ పద్మావతి నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ సమస్య లేదన్నారు. పాత విద్యుత్ లైన్ల స్థానంలో కొత్త లైన్లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఏఈ లేనందున మరొకరు బాధ్యతలు స్వీకరించిన వెంటనే మరమ్మతులను చేపడుతామన్నారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారం తమ వద్ద ఉందన్నారు. ఇటీవల పద్మావతి నగర్‌లో విద్యుత్ స్తంభాలను పరిశీలించామన్నారు.

మహానాడుకు జన సమీకరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కడపలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు కార్యక్రమానికి బుచ్చిరెడ్డిపాళెం నుంచి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో భారీగా జన సమీకరణ చేశారు. పట్టణంలోని నారాయణాద్రి లేఅవుట్‌లో గురువారం బస్సులు, కార్లకు జెండా ఊపి ప్రారంభించారు. జన సమీకరణ కోసం వేమిరెడ్డి దంపతులు భారీగా ఖర్చుచేసినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా గ్రావెల్ దందా

మనుబోలు : మండలంలో ఓ వ్యక్తి ఇష్టారాజ్యంగా మట్టి, గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. మనుబోలు పరిసర ప్రాంతాల్లో ఎవరికి గ్రావెల్, తువ్వ ఇసుక, మట్టి కావాలన్నా స్థానికంగా ఉండే మాల్యాద్రిదే పెత్తనం. ఎలాంటి అనుమతులు లేకపోయినా రెవెన్యూ అధికారులను మేనేజ్ చేసుకుంటూ అక్రమార్జన చేస్తుంటారు. జేసీబీలు, ట్రాక్టర్ పెట్టి ఎక్కడ ప్రభుత్వ భూమి ఉంటే అక్కడ వాలిపోయి ఇష్టారాజ్యంగా తవ్వేస్తుంటారు. ప్రస్తుతం రైల్వేగేటు వద్ద చెర్లోపల్లి చెరువు నుంచి, మడమనూరు సమీపంలోని ప్రభుత్వ భూముల నుంచి మట్టి తరలించి ప్రైవేటు పరిశ్రమలు, వ్యక్తులకు అమ్ముకుంటున్నాడు. కొన్ని సందర్భాల్లో అక్రమంగా తరలించిన మట్టి, గ్రావెల్‌ను మొదట మడమనూరు సమీపంలోని మామిడితోటల్లో డంపింగ్ చేసి తరువాత విక్రయిస్తున్నట్లు సమాచారం. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు మట్టి, గ్రావెల్ అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.


మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోండి

మనుబోలు: ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు నగదుతో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ జలజాక్షి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని కట్టువపల్లి, బద్దెవోలు, వెంకన్నపాళెం గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆమె గురువారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేల నగదును అదనంగా చెల్లిస్తోందని తెలిపారు. ఈ నగదు సాయంతో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి జూన్ 22 నాటికి గృహ ప్రవేశాలు చేయాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి దేవసేన, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళి ఉన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అండగా ఉంటాం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అక్రమ కేసులో అరెస్టయిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన, విద్యార్థి విభాగ నేతలు పేర్కొన్నారు. డైకస్‌రోడ్డులోని కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో ఆయన కుమార్తె పూజితను యువజన, విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున, ఆశ్రిత్‌రెడ్డి గురువారం కలసి ధైర్యం చెప్పారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఎండగట్టారు. హామీలను అమలు చేయకుండా.. డైవర్షన్ పాలిటిక్స్‌ను టీడీపీ అనుసరిస్తోందని మండిపడ్డారు.


పూజితను కలిసిన నేతలు

యోగాతో ఆరోగ్యకర జీవనం

విడవలూరు: యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమని ఎంపీడీఓ నగేష్‌కుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలాధికారులు, సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు కూడా యోగా ఆవశ్యకతను తెలియజేయాలన్నారు.

⇨ **కొడవలూరు:** మండలంలోని గండవరంలో స్థానిక ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో యోగాపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యాధికారిని ఎస్.గీత మాట్లాడుతూ యోగా దినోత్సవం సందర్భంగా యోగాపై అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా యోగాపై శిక్షణ ఇస్తున్నందున ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.బ్రహ్మానందరెడ్డి, మహిళా పోలీస్ శిరీష, వీఏఏ కవిత, యోగా శిక్షకుడు జె.రాజేంద్రకుమార్, ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది సుజాత, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

⇨ **మనుబోలు:** యోగా ద్వారా ఆరోగ్యంతో పాటు మంచి జీవనశైలి అలవడుతుందని యోగా ట్రైనర్ చెలికం కోటేశ్వరరెడ్డి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మనుబోలు సచివాలయం–2 పక్కన ఉన్న కమ్యూనిటీ హాల్, మడమనూరు గ్రామంలో యోగా ప్రాముఖ్యతను గ్రామస్తులు, విద్యార్థులకు గురువారం వివరించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవన శైలిలో ప్రతిరోజూ కొద్దిసేపు యోగా చేయడం వల్ల ఒత్తిడి దూరం అవడమే కాకుండా శరీరానికి మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఎంపీడీఓ జలజాక్షి, పంచాయతీ కార్యదర్శి గరుడయ్య, బీజేపీ నేత బోలా శ్రీనివాసులు ఉన్నారు.

నేడు పోటీలు

పొదలకూరు : యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం అన్నిగ్రామాల్లో యోగా పోటీలను నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వారు పాల్గొనాల్సిందిగా ఎంపీడీఓ డీవీ నరసింహారావు అన్నారు. ఆయా సచివాలయాల్లో పోటీలను ఏర్పాటు చేస్తామన్నారు.


విడవలూరు: యోగాసనాలు వేస్తున్న అధికారులు



కొడవలూరు: గండవరంలో అవగాహన ర్యాలీ


మనుబోలులో..

వీఆర్ హైస్కూల్ ఆధునికీకరణ పనుల పరిశీలన

నెల్లూరు (టౌన్): వీఆర్ హైస్కూల్‌ను అంతర్జాతీయ స్థాయిలో మంత్రి నారాయణ తీర్చిదిద్దనున్నారని ఆయన కుమార్తె శరణి తెలిపారు. పాఠశాలలో చేపట్టిన ఆధునికీకరణ పనులను ఎన్‌సీసీ సిబ్బందితో కలిసి గురువారం ఆమె పరిశీలించారు.

అనారోగ్యంతో అటెండర్ మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఆస్పత్రికి తరలిస్తుండగా అటెండర్ మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. లేక్‌వ్యూ కాలనీకి చెందిన రామయ్య (54) శబరి శ్రీరామక్షేత్రం సమీపంలోని తెలుగుగంగ కార్యాలయంలో అటెండర్‌గా.. ఆయన భార్య విజయమ్మ నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నారు. కొంతకాలంగా వివిధ అనారోగ్య సమస్యలతో ఆయన బాధపడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఘటనపై దర్గామిట్ట పోలీసులకు భార్య ఫిర్యాదు చేశారు. హాస్పిటల్‌కు ఎస్సై రమేష్ బాబు చేరుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేశారు. కాగా మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

సృజనాత్మకత వెలికితీతకే పోటీలు


యల్లాయపాలెంలో..

కొడవలూరు: విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీసేందుకే డ్రాయింగ్, క్విజ్, క్రాఫ్ట్ తదితరాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయుడు పి.రంగారెడ్డి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అనేక రకాల నైపుణ్యాలుంటాయని, అవకాశాలు కల్పించడం ద్వారా వాటిని బయటకు తేవచ్చన్నారు. లైబ్రేరియన్ జె.సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

⇨ **కొడవలూరులో..**

వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు కలర్ పేపర్లతో వివిధ రకాల బొమ్మలు చేయడంపై గురువారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారితో పాల్గొన్న వారికి బహుమతుల ప్రదానం ఉంటుందని లైబ్రేరియన్ కె.రాజేశ్వరి తెలిపారు.


కొడవలూరు గ్రంథాలయంలో..

జక్కా వెంకయ్యకు ఘన నివాళి

కొడవలూరు: పేదల కోసం నిరంతరం పరితపించిన నేత జక్కా వెంకయ్య అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ అన్నారు. జక్కా వెంకయ్య వర్ధంతి సందర్భంగా నార్తురాజుపాళెం బస్టాండ్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం ఆయన ఎంతగానో పోరాడారన్నారు. నేటి తరం నేతలు స్వార్థంతో రూ.కోట్లు గడిస్తున్నారే తప్ప ప్రజా క్షేమం గురించి పట్టడం లేదన్నారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తలారి నరసింహం, దేవానంద్, ఎం.సురేష్, ఎస్.సామియేలు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెంలో...

⇨ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జక్కా వెంకయ్య వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. సీఐటీయూ, సీపీఎం నాయకులు పాల్గొని ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో జక్కా వెంకయ్య పాత్ర మరువలేనిదన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన అనేక పోరాటాలు చేసి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు.


కొడవలూరు: జక్కా వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

ముత్తుకూరులో..

⇨ **ముత్తుకూరు(పొదలకూరు):** సీపీఎం నాయకుడు జక్కా వెంకయ్య వర్ధంతిని ముత్తుకూరు మండలంలోని మామిడిపూడి గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు మజ్జిగను అందజేశారు. శ్యాంప్రసాద్, రాఘయ్య పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరులో..

మండలంలోని నరుకూరు సెంటర్‌లో జక్కా వెంకయ్య వర్ధంతిని సీపీఎం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కమిటీ సభ్యురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, జిల్లా ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు రాజా, మధుసూదనమ్మ, రమణమ్మ, ప్రభావతమ్మ పాల్గొన్నారు.